

రోడ్డుపై ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులపై కేసు

7

- ధాన్యం కుప్పను ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటనలో ఇద్దరిపై చర్యలు : సిద్దిపేట రూరల్ సీఐ

కాంగ్రెస్ వచ్చాకే కరెంట్ లేక పంటలు ఎండుతున్నాయి

- కేసీఆర్ హయాంలో రైతులకు ఎలాంటి కష్టాల్లేవ్
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు, ఏప్రిల్ 21 : కేసీఆర్ హయాంలో రైతులకు ఎలాంటి కష్టాలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కరెంటు లేక పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతులతో మాట్లాడారు. 15 రోజులుగా కేంద్రంలోనే ధాన్యం ఉంచినా ప్రభుత్వం కొనడం లేదని.. అకాల వర్షానికి కొంత మేర ధాన్యం తడిసిందని హరీశ్‌రావుకు తెలిపారు. వ్యవసాయ బావుల వద్ద మోటార్లు కాలుతున్నాయా అని హరీశ్ అడగగా ఓ రైతు తనవి రెండు మోటార్లు కాలిపోయానని చెప్పాడు. హరీశ్‌రావు మాట్లాడుతూ రైతులు అధైర్యపడొద్దని, అధికారులతో మాట్లాడుతానని, వెంటనే వడ్ల కొనుగోలు ప్రారంభించేలా చూస్తానన్నారు. తొందరపడి తక్కువ ధరకు అమ్మొద్దని, రూ.2200 మద్దతు ధర ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో ఇలాంటి కష్టాలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మోటార్లు కాలిపోతున్నాయని, రైతుబంధు పడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గంగాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మపెద్దిరాజుల కల్యాణ మహోత్సవ వేడుకల్లో హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాపయ్య, పీఏసీఎస్ ఛైర్మన్ కనకరాజు, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు ఉమేష్‌చంద్ర, లింగం, లింగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

పప్పు ధరలు పైపైకి..

కందిపప్పు కిలో రూ. 170..!



వారం వ్యవధిలో రూ. 40 పెరుగుదల

నషాలాన్నంటుతున్న మసాలాల రేట్లు

మెదక్, ఏప్రిల్ 21 : కందిపప్పు ధరలు కుతకుతమంటున్నాయి. వారం రోజుల క్రితం కందిపప్పు కిలో రూ.130కు లభ్యమయ్యేది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రూ.170 వరకు విక్రయిస్తున్నారు. ధరలు చుక్కలనంటుతుండంతో సామాన్యుడికి పప్పు అన్నం కరువవుతోంది. రానున్న రోజుల్లో కందిపప్పు ధర డబుల్ సెంచరీకి చేరినా ఆశ్చర్యం లేదని వ్యాపారులు అంటున్నారు. ఒక కందిపప్పే కాకుండా అన్ని పప్పుదినుసుల ధరలూ పెరిగాయి. మొన్నటి వరకు పెసరపప్పు కిలో రూ.102 ఉండగా, అది కాస్తా రూ.120 వరకు పలుకుతోంది. రాష్ట్రంలో గతేడాది కంది పంట సాగు తగ్గిపోవడంతో దీని ప్రభావం ధరలపై పడింది. నాణ్యమైన కంది పప్పు గుజరాత్, మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి దిగుమతి అవుతోంది. రాష్ట్రంలోని తాండూర్, వికారాబాద్, మెదక్ జిల్లాలోని టేక్మాల్, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, రేగోడ్ మండలాల రైతులు ఈ ఏడాది పప్పుదినుసుల పంట సాగుపై ఆసక్తి కనబర్చలేదు. మరోపక్క దేశవ్యాప్తంగా కంది సాగు తగ్గిపోయిందని ఉద్యానవన అధికారులు చెబుతున్నారు. గతంలో కందిపప్పు ధర పెరిగిన సందర్భంలో ప్రభుత్వమే చౌకధరల దుకాణాల్లో తక్కువ ధరకు సరఫరా చేసిన సందర్భాలున్నాయి.

ఘాటెక్కిన మసాలా దినుసులు

నిత్యం వంటకాల్లో వినియోగించే మసాలాల ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. ముఖ్యంగా మాంసాహార వంటకాలలో మసాలాలు లేనిదే అసలు వంటలు చేయడం సాధ్యం కాదు. శాకాహార వంటకాలకూ మసాలా దట్టిస్తే ఆ రుచే వేరు. ప్రతీ చిన్న కార్యక్రమానికి బిర్యానీ వండి వడ్డించడం పరిపాటైంది. జీలకర్ర, ధనియాలు, మెంతులు, ఆవాలు వినియోగమూ ఎక్కువే. గత వర్షాకాలంలో ఉత్తర భారతం, ఈశాన్య రాష్ట్రాలలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో మసాలా దినుసుల దిగుబడులు తగ్గాయి. దాంతో ఇతర దేశాల నుంచి దిగుమతవుతున్నాయి. కొన్ని నెలలుగా మసాలా ధరలు ఓపెన్ మార్కెట్‌లో మండిపోతున్నాయి. జాజికాయ, జాపత్రి, ఇలాచీ, బిర్యానీ ఆకు తదితర మసాలా దినుసులు కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి తెలుగు రాష్ట్రాలకు దిగుమతి అవుతున్నాయి. యాలకుల ధర గతంలో కిలో రూ.1400కు లభ్యమయ్యేవి. ప్రస్తుతం కిలో రూ.2400లకు చేరాయి. లవంగాల ధర రూ.800 కాగా, ప్రస్తుతం రూ.1100కు ఎగబాకింది. ఇలా గత రెండు, మూడు నెలల నుంచి దాదాపు అన్ని మసాలాల ధరలూ పెరిగిపోయాయి.



హోల్‌సేల్ ధరలూ పెరిగాయి

కొన్ని నెలలుగా మసాలాల ధరలు పెరిగాయి. హైదరాబాద్‌లోని హోల్‌సేల్ మార్కెట్‌లోనే ధరలు పెంచేయడంతో తప్పని పరిస్థితుల్లో మేమూ పెంచి అమ్మాల్సి వస్తోంది. కందిపప్పు ఉగాది పండుగ వరకు కిలో రూ.130కి విక్రయించాం. ఆ తర్వాత ఆశ్చర్యంగా రూ.40 వరకు పెరిగింది. చూస్తుంటే రానున్న రోజుల్లో రెండు వందల వరకు చేరేలా కనిపిస్తోంది.

- త్యార్ల ప్రభాకర్, వ్యాపారి, మెదక్

మల్లన్న క్షేత్రం.. భక్తిపారవశ్యం

- ముఖమండపం, గంగిరేగుచెట్టు ప్రాంగణం కిటకిట
- స్వామివారి దర్శనానికి గంట సమయం

చేర్యాల, ఏప్రిల్ 21 : వేలాదిమంది భక్తులు తరలిరావడంతో కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం కిటకిటలాడింది. భక్తులు బోనంచేసి, పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మదేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాకపెట్టి ఒడిబియ్యాలు పోశారు. ప్రత్యేక, ఉచిత ధర్మదర్శనం క్యూలైన్లల్లో రద్దీ కొనసాగడంతో స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. పట్నాలు వేసిన భక్తులతో ముఖమండపం, గంగిరేగుచెట్టు ప్రాంగణాలు సందడిగా మారాయి. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏఈవో బుద్ది శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ యాప్రాల్‌కు చెందిన భక్తుడు సాయి భవి కొరెడ్డి రూ.1,00,116 నగదును పునరుద్ధరణ కమిటీ ఛైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి సమక్షంలో ఆలయాధికారులకు అందించారు.



మల్లన్న నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

టెండర్‌దారుల తీరుపై భక్తుడి ఆగ్రహం



భక్తుడిని అడ్డుకుంటున్న టెండర్ నిర్వహక సిబ్బంది

కరీంనగర్‌కు చెందిన ఓ భక్తుడు ఇంటిల్లిపాదితో కొమురవెల్లికి వచ్చారు. పట్నం వేయడానికి పూజాసామగ్రితో కుటుంబసభ్యులు గంగిరేగుచెట్టు ప్రాంగణంలోకి వెళ్లిపోయారు. కాసేపటికి అతడు ఆలయానికి చేరుకోగా, రాజగోపుర ఆవరణలో సెల్‌ఫోన్ టెండర్‌దారుల సిబ్బంది సెల్‌ఫోన్ ఇస్తేనే లోపలికి అనుమతిస్తామని అడ్డుకున్నారు. దీంతో తాను ఆలయం లోపలికి వెళ్లడం లేదని చెప్పినా వినకుండా వెంటపడి వాగ్వాదానికి దిగారు. దౌర్జన్యం చేయడంపై భక్తుడు మండిపడటంతో కొంత సేపు గందరగోళం నెలకొన్నది. భక్తులతో వాగ్వాదానికి దిగిన విషయం తెలిసిన ఆలయ ఈవో బాలాజీశర్మ, ఏఈవో శ్రీనివాస్ సెల్‌ఫోన్ డిపాజిట్ టెండర్‌దారుడిని మందలించారు. డిటెక్టర్లతో తనిఖీ చేయొద్దని, భక్తులు ఇస్తేనే సెల్‌ఫోన్ డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. కానీ, లక్షలాది రూపాయలు పెట్టి టెండర్ పాడామని, తమకెలా డబ్బు వస్తుందని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. దీంతో పద్ధతి మార్చుకోకపోతే టెండర్ రద్దు చేస్తామని ఆలయాధికారులు హెచ్చరించారు. అనంతరం ఈవో బాలాజీశర్మ విలేకరులతో మాట్లాడుతూ టెండర్ గడువు పూర్తయ్యాక సెల్‌ఫోన్ డిపాజిట్ కౌంటర్ పూర్తిగా రద్దు చేస్తామని, భక్తుల ఇబ్బందుల దృష్ట్యా లగేజ్ కౌంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



అఖిల్‌ను సత్కరిస్తున్న గ్రామస్థులు, నాయకులు

సివిల్స్ ర్యాంకర్ అఖిల్‌కు అభినందనలు

కొండపాక, ఏప్రిల్ 21 : సివిల్స్ 321 ర్యాంకు సాధించిన కొండపాకకు చెందిన బుద్ధి అఖిల్‌ను ఘనంగా సత్కరించారు. ఆదివారం సాయంత్రం అఖిల్ కొండపాకకు విచ్చేశారు. ఆయన చిన్ననాటి స్నేహితులు, యువకులు, వివిధ పార్టీల నాయకులు, యాదవ సంఘం సభ్యులు అఖిల్‌కు స్వాగతం పలికి ఘనంగా సత్కరించి అభినందించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. అలాగే వడ్డెర సంక్షేమ సంఘం నాయకుడు రేపాక స్వామితోపాటు యువకులు సత్కరించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అఖిల్‌ను సత్కరించారు. గ్రామస్థాయి నుంచి సివిల్స్ సాధించిన అఖిల్‌ను పలువురు అభినందించారు.

నట్టడివిలో నిలువుదోపిడీ




- మల్లన్న భక్తులను దోచుకుంటున్న పూజారులు
- మొక్కు చెల్లింపు పూజలకు రూ. వేలు వసూలు
- హుండీలో డబ్బు వేయకుండా అడ్డగింత
- ఇదేమని అడిగితే.. భక్తులపైనే ఆగ్రహం

దుబ్బాక, ఏప్రిల్ 21 : నట్టడివిలో వెలిసిన మల్లన్న ఆలయంలో భక్తులు నిలువుదోపిడీకి గురవుతున్నారు. మొక్కులు తీర్చకుంటే ఏ కీడు శంకిస్తుందోననే సందేహం. దేవుడి వద్దకు వచ్చి పూజారులతో గొడవ పడొద్దనే సంయమనం భక్తుల పాలిట శాపంగా మారింది. దేవాదాయ శాఖ పరిధిలోని దుబ్బాక రేకులకుంట మల్లికార్జున, రేణుకాదేవి ఎల్లమ్మ ఆలయంలో కొందరు ఒగ్గుపూజారుల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని భక్తులు వాపోతున్నారు.

మొక్కుల చెల్లింపునకు రూ.250

దుబ్బాక అటవీ ప్రాంతంలోని రేకులకుంట మల్లికార్జున ఆలయానికి రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో నుంచే కాకుండా షోలాపూర్, బీవండి, నాందేడ్, బీదర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఏడాది పొడువునా ప్రతీ ఆదివారం, మంగళవారం ఆలయానికి భక్తుల రద్దీ ఉంటుంది. భక్తులు పట్నాలు, మత్తకొలపడం, బోనాలు తీయడం, సుంకు



గతంలో ఆలయంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బియ్యం సమర్పించడం వంటి మొక్కులు తీర్చుకుంటారు. దీనికి దేవాదాయశాఖ రూ.250 టికెట్ ధరను నిర్ణయించింది. అయితే ఆలయంలో అర్చకత్వం కింద 63 మంది పూజారులను నియమించారు. ఇక్కడి ఆచారం ప్రకారం పట్నాలను ఈ ఒగ్గుపూజారులు వేయడం ఆనవాయితీ. ఇందుకు దేవాదాయ శాఖ వారికి గౌరవ వేతనం అందిస్తుంది. తొలిరోజుల్లో భక్తులు ఒగ్గుపూజారులకు డబ్బు ఇస్తే అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తూ వచ్చారు. అదే ప్రమాదంగా మారి, భక్తులకు శాపమైంది.

అడిగినంత ఇస్తేనే..

చాలా దూరం నుంచి భక్తులు ఇక్కడికి బంధు, మిత్రగణంతో వచ్చి, బసచేసి, రాత్రే పూజా కార్యక్రమాలను నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. వారి వెంట తెచ్చుకున్న మేకను మత్తగొలిపి, కుటుంబసభ్యులు, బంధువులతో విందు భోజనాలను చేస్తారు. అందుకే, తెల్లారితే బంధువులు, మిత్రులు వస్తారని, భక్తులు పూజాది కార్యక్రమాలను రాత్రి వేళ సకాలంలో పూర్తి చేసుకోవాలని చూస్తారు. ఇదే అదునుగా కొందరు పూజారులు తమ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. అడిగినంత డబ్బు ఇవ్వకుంటే పూజలను చేసేందుకు నిరాకరిస్తున్నారు. భక్తులతో కటువుగా వ్యవహరిస్తూ డబ్బివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అడిగినంత ఇవ్వని భక్తులను మొక్కులు చెల్లించకుండా ఆలయం నుంచి వెళ్లగొట్టేంత పని చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సీసీ కెమెరాల తొలగింపు

ఆలయం పలుసార్లు వివాదాస్పదంగా మారడం, అక్రమాలకు తావివ్వకుండా ఉంటుందని భావించిన దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. అయితే, ఆయన మరణానంతరం సీసీ కెమెరాలను తొలగించారు. అదే సమయంలో కార్యనిర్వహణాధికారి ఆలయ గోడలపై దేవాదాయ శాఖ అధికారుల సెల్ నంబర్‌తో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. ఐడీ నంబర్ ఉన్న ఒగ్గుపూజారుల వద్దే పట్నాలు వేయించుకోవాలని, ఎవరైనా అదనంగా డబ్బు వసూళ్లకు పాల్పడితే సూచించిన నంబర్లకు ఫిర్యాదు చేయాలని ఫ్లెక్సీలను ఉంచారు. అయినా, ఇక్కడ అదనపు వసూళ్ల తీరేమీ మారలేదు.

హుండీలో డబ్బు వేయనివ్వరు

ఆలయానికి ఏటా రూ.44 లక్షల వరకు ఆదాయం వస్తుంది. భక్తులు మొక్కు తీర్చడానికి హుండీలో డబ్బుతోపాటు బంగారం, వెండిని కూడా సమర్పిస్తారు. ఇప్పటివరకు 15 కిలోల వెండి, 500 గ్రాముల వరకు బంగారం వచ్చినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలిసింది. అయితే, ఒగ్గుపూజారులు మాత్రం హుండీలో డబ్బులు వేయకుండా అడ్డుకుంటున్నారు.



పూజారులతో పట్నాలు వేయించి మొక్కు తీర్చుకుంటున్న భక్తులు

దీంతో ఆలయ ఆదాయం పక్కదారి పడుతుందనే ఆరోపణలున్నాయి.

తీరు మారలే..

భక్తులతో గొడవకు దిగుతున్న ఒగ్గుపూజారుల మధ్యే సమన్వయం లోపించి గొడవలకు కారణమవుతున్నట్లు తెలిసింది. ఇటీవల ఆలయంలో పూజారుల నియామకం విషయంలో చెలరేగిన గొడవలు అక్రమార్జనే మూలమని భక్తులు బహిరంగంగానే అంటున్నారు. గొడవ అనంతరం గుర్తింపుకార్డు ఉన్న పూజారులే పట్నాలు వేయించాలని దేవాదాయశాఖ అధికారులు, పోలీసులు హెచ్చరించినా మారలేదు. భక్తులపై ఎగబడడం, ఆపై అందినకాడికి డబ్బు డిమాండ్ చేయడం జరుగుతూనే ఉంది. ఆలయానికి రెగ్యులర్ కార్యనిర్వహణాధికారి లేకపోవడంతోనే ఈ మితిమీరిన ఆగడాలు పెరిగిపోయాయని భక్తులు వాపోతున్నారు. ఒగ్గుపూజారుల పెత్తనాన్ని నిలువరించి ప్రశాంతంగా భక్తులు చెల్లించుకునేలా చూడాలని కోరుతున్నారు.

అకాల వర్షాలకు రైతులు అధైర్యపడొద్దు

- ప్రతీ గింజనూ కొనుగోలు చేస్తాం
- కలెక్టర్ మనుచౌదరి



సిద్దిపేట అగ్రికల్చర్, ఏప్రిల్ 21 : అకాల వర్షాలకు ధాన్యం తడిసిందని రైతులు అధైర్యపడొద్దని, ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో ఆదివారం ఆయన టెలికాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. జిల్లాలోని 418 కొనుగోలు కేంద్రాలును ప్రారంభించామని, ఇప్పటివరకు 11,305 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 2,365 రైతుల నుంచి కొనుగోలు చేశామని తెలిపారు. అన్ని కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. అకాల వర్షాల దృష్ట్యా ఇంకా అవసరమైన చోట్ల టార్పాలిన్‌లను సమకూర్చాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. జాప్యం లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరిపి, ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలని, మిల్లర్లు ధాన్యంలో ఎలాంటి కోతలు పెట్టకుండా చూడాలని ఆదేశించారు. రైస్‌మిల్లులకు ధాన్యం బస్తాల తరలింపును వేగవంతంగా చేపట్టాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో డీఎం హరీష్, డీసీవో తనూజశ్రీ, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, పీడీ మెప్మా హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్ మత్తడి వద్ద ఏనెను ధ్వంసం చేసి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న మట్టి

ఏనెకు ఎసరు..!

- ధ్వంసం చేస్తూ ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టి తరలింపు
- కనుమరుగవుతున్న ప్రకృతి పేర్చిన ఎత్తయిన గోడ

7లో

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచులు



రాష్ట్ర నాయకుల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న తాజా మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, నాయకులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 21: సంగారెడ్డి జిల్లా ఖేడ్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్‌కు చెందిన పలువురు తాజామాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, నాయకులు ఆదివారం ఖేడ్‌లో టీపీసీసీ సభ్యులు కర్నె.శ్రీనివాస్, శంకరయ్యస్వామి, ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీ ప్రణాళిక సంఘం సభ్యుడు నగేష్ షెట్కార్‌ల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. చేరిన వారిలో ఖేడ్ మండలం పగిడిపల్లి తాజా మాజీ సర్పంచు ప్రసాద్, వార్డు సభ్యుడు చిరంజీవి, సిర్గాపూర్ మండలం జమ్లాతండా తాజా మాజీ సర్పంచ్ దివ్యభారతిచరణ్, వారి అనుచరులు, ఆయా గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, పెద్దశంకరంపేట మండలం మూసాపేట పీఏసీఎస్ డైరెక్టర్ సత్యేందరక్‌రెడ్డి, మాజీ విద్యాకమిటీ వెంకట్‌రాంరెడ్డి, మాజీ ఉప సర్పంచు కిష్టయ్య, గ్రామ రజక సంఘం అధ్యక్షుడు కేశయ్య, మైనార్టీ నాయకులు దస్తగిరి, పలువురు మాజీవార్డు సభ్యులు, నాయకులు ఉన్నారు. కాగా సిర్గాపూర్ మండలం జమ్లాతండా మాజీ సర్పంచ్ దివ్యభారతిచరణ్ స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డిని కూడా కలిశారు.

కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలి

● నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్/కల్హేర్, ఏప్రిల్ 21: కేంద్రంలో బీజేపీకి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి, పార్లమెంట్ ఎన్నికల్లో రెండు పార్టీలను ఓడించి గుణపాఠం చెప్పాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన నిజాంపేట, నిజాంపేట మండల పరిధిలోని నాగ్‌ధర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని నమ్మబలికి ప్రజలను ప్రలోభాలకు గురి చేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యారంటీలను అమలు చేయకుండా మభ్యపెడుతున్నారని విమర్శించారు. అమలుకానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏ ముఖం పెట్టుకుని పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ కూడా ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదన్నారు. ఈ రెండు పార్టీల విధానాలను ప్రజలకు వివరించి, జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ విజయం కోసం ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఆయా సమావేశాల్లో ఎంపీపీ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, తాజామాజీ సర్పంచ్ జగన్‌చారి, ఉప సర్పంచ్ రాజీబాయిరాంచందర్, నాయకులు కిష్టారెడ్డి, సాయిలు, రాజు, మల్లయ్య, గోపి, అడివప్ప, అజయ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏనెకు ఎసరు..

- ధ్వంసం చేస్తూ ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా అక్రమంగా మట్టి తరలింపు
- కనుమరుగవుతున్న ప్రకృతి పేర్చిన ఎత్తయిన గోడ
- పర్యవరణానికి ముప్పు
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ అధికారులు

హుస్నాబాద్, ఏప్రిల్ 21: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణానికి తోరణంలా ఉండే ఏనె(గుట్ట)ను కొందరు అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. ఈ ప్రకృతి పేర్చిన ఎత్తయిన గోడ క్రమ క్రమేణా కనుమరుగవుతోంది. పట్టణంలో ఎక్కడి నుంచి చూసినా నల్లటి గుండ్ల మధ్య పచ్చటి చెట్లతో కనిపించే ఈ ఏనే భూమికి సమాంతరమవుతున్నది. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో అమాంతం పెరిగిన భూముల ధరలతో తన అకృతిని కోల్పోతున్నది. ఎక్స్‌కవేటర్లు పెట్టి పెద్ద పెద్ద గుండ్లను తొలగిస్తూ అందులోని బంగారంలాంటి మట్టితో వ్యాపారం చేస్తున్నారు. పట్టణాన్ని ఆనుకుని ఉండే ఈ ఏనేపై నెమళ్ల సంచారం, ఇతర జీవరాశుల సమూహం కనువిందు చేసేవి. ముఖ్యంగా గొర్లు, మేకలను మేపుకోవడానికి ఉపయోగంగా ఉండేది. క్రమక్రమేణా ఇవి దూరమవుతున్నాయి. దాదాపు 8కిలోమీటర్ల మేర పరుచుకున్న ఈ ఏనెలో కొంత ప్రభుత్వం పలు కుల సంఘాలకు అవసరాల నిమిత్తం భూమిని పంపిణీ చేయగా మరి కొంత భాగానికి పట్టాదారులున్నారు. దీనికి పట్టాదారులైనప్పటికీ ఇందులోని ఒక్క రాయిని తీయాలన్నా మైనింగ్ శాఖ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. కానీ ఇవేవీ ఇక్కడ అమలు కావడం లేదు. ప్రతీ రోజు వందలాది ట్రాక్టర్లు ఏనేలోని రాయి, మట్టిని తరలిస్తున్నా మైనింగ్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా మత్తడి వైపు, కూచనపల్లి వైపు ఉన్న ఏనెను ఇప్పటికే మొత్తం తొలిచారు. అక్కడ చూస్తే ఓపెన్ కాస్ట్ బొగ్గు గనిని తలపిస్తున్నది. ఎనిమిది సంవత్సరాల క్రితం హరితహారం ప్రారంభానికి వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్ ఈ ఏనెపై కోటి మొక్కలు నాటాలని సూచించారు. కోటి మొక్కలేమో కాని ఏనె తన ఆనవాళ్లనే కోల్పోతున్నది.

చరిత్ర కలిగిన ఏనె

హుస్నాబాద్ పట్టణానికి దక్షిణ భాగాన ఈ ఏనె ఉన్నది. మండలంలోని కూచనపల్లి నుంచి పోతారం(ఎస్) వరకు దాదాపు 8 కిలోమీటర్ల మేర ఇది పరుచుకొని ఉండగా హుస్నాబాద్ చెరువు వద్ద ఎల్లమ్మ ఏనెగా, పోతారం గ్రామం (ఎస్) వద్ద వడ్లోని ఏనేగా పిలుస్తారు. పోతారం(ఎస్) వద్ద ఇది దక్షిణం నుంచి ఉత్తరం వైపుగా మారి మహాసముద్రం గండి వరకు కొనసాగింపుగా ఉంటుంది. కాకతీయుల కాలంలో దీనినే కట్టగా చేసుకొని ఎల్లమ్మ చెరువు నిర్మించారని చెబుతారు. హుస్నాబాద్ పట్టణానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉండే ప్రస్తుత అక్కన్నపేట మండలం కట్కూర్ వరకు హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు ఉండేదని, ఈ చెరువులో చేపలు పట్టేవారని చరిత్రకారులు చెబుతారు. దశాబ్దం కిందటి వరకు కూడా దీనిపై గొర్లు, మేకలు మేపుకునే వారు. వంట చెరుకు ఈ ఏనె నుంచి తెచ్చుకునేవారు. పట్టణాన్ని ఆనుకునే ఇది ఉండడంతో పచ్చటి చెట్లతో ఇంటికి మామిడి తోరణంలా ఉండేంది. ఈ గుట్టపై నుంచి చూస్తే హుస్నాబాద్ పట్టణం ఎంతో అందంగా కనిపించేది.





హుస్నాబాద్ మత్తడి వద్ద ఏనెను ధ్వంసం చేసి, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్న దృశ్యాలు

భూముల ధరలు పెరుగడంతోనే..

భూముల ధరలకు రెక్కలు రావడంతో దీని విధ్వంసం మొదలైంది. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వైపు ఉన్న ఏనె ప్రభుత్వ భూమి కావడంతో దీనిని పలు కుల సంఘాలకు అవసరాల నిమిత్తం పంపిణీ చేశారు. ఇక్కడ ఆయా కులాల నాయకులు కొంత మేర విక్రయించారు. ఇవి అనేక చేతులు మారాయి. గుట్టను కొంత మేర తొలగించి ఇళ్లను కూడా నిర్మించారు. ఇక పట్టణంలోని అక్కన్నపేట రోడ్డు నుంచి పోతారం ఎస్ సమీపం వరకు ఉన్న ఏనెకు పట్టాదారులున్నారు. వీటి యజమానులు కొందరు ఆరేడు సంవత్సరాల క్రితం రియల్టర్లకు విక్రయించగా అప్పటి నుంచి దీని ధ్వంసం చేయడం మొదలు పెట్టారు. ఇప్పటికే పలు చోట్ల ఏనేను తొలచి ప్లాట్లు చేసి విక్రయించారు. సొంత భూమి అయినప్పటికీ గుట్టలోని చిన్న రాయిని తీయాలన్నా మైనింగ్ శాఖ అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలి. కానీ ఇవేవి ఇక్కడ పని చేయడం లేదు.

అక్రమంగా మట్టి తరలింపు

ఎల్లమ్మ చెరువు మత్తడి వైపు, పోతారం (ఎస్) వైపు ఉన్న ఏనె నుంచి ఎక్స్‌వేటర్లు పెట్టి ప్రతీ రోజు వందలాది ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. మరి కొన్ని చోట్ల టిప్పర్లతో మట్టిని వ్యాపారం చేస్తూ ఏనేను ధ్వంసం చేస్తున్నారు. ఈ ఏనె పక్కన వ్యవసాయ భూములు ఉండడంతో మట్టిని తరలించే ట్రాక్టర్లు, టిప్పర్ల రాకపోకలతో తమ పంటలు ధ్వంసం అవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏనెను రక్షించాలి



వందలాది ఏండ్ల చరిత్ర ఉన్న ఏనెను ఎక్స్‌కవేటర్లతో తవ్వుతూ వందలాది ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా రియల్ ఎస్టేట్ వెంచర్లకు మట్టిని తరలిస్తున్నారు. సెలవు దినాలు, ఆదివారం రోజున ఏనె నుంచి మట్టి రవాణా చేస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఈ మట్టి దందాను అడ్డుకొని ఏనెతో పాటు పర్యావరణాన్ని రక్షించాలి.

- వేణుగోపాల్‌రెడ్డి, కిసాన్ సంఘ్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు



గతంలో ఏనె స్థలంలో ఏర్పాటు చేసిన ప్లాట్లు

బీహార్‌కు చెందిన కార్మికుడి హత్య

మనోహరాబాద్, ఏప్రిల్ 21: మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి శివారులోని ఓ కంపెనీలో పనిచేస్తూ అక్కడే నివాసముంటున్న బీహార్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు శనివారం రాత్రి హత్యకు గురయ్యాడు. మనోహరాబాద్ ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం బెల్వానియా గ్రామానికి చెందిన సోదరులు సునీల్ మాంజి, ధనుంజయ్ మాంజి, సర్వన్‌కుమార్ మాంజి(23)తో పాటు అదే రాష్ట్రానికి చెందిన సంజయ్, ఓంప్రకాష్ రాయ్ ముప్పిరెడ్డిపల్లి శివారులోని వీవీఎం ఆగ్రో కంపెనీ పనిచేస్తూ సమీపంలోని క్వార్టర్స్‌లో నివాసముంటున్నారు. శనివారం రాత్రి 8 గంటలకు సంజయ్, ఓంప్రకాష్ రాయ్‌తో కలిసి సర్వన్‌కుమార్ సరుకులు తీసుకురావడానికి కిరాణ దుకాణానికి వెళ్లారు. కొంత సమయానికి సంజయ్ తిరిగి రూం వద్దకు రాగా సర్వన్‌కుమార్, ఓంప్రకాష్‌రాయ్ రాలేదు. రాత్రి 10 గంటలకు సునీల్ మాంజి, ధనుంజయ్ మాంజి సోదరుడి కోసం వెతుకగా కంపెనీ సమీపంలో తలకు బలమైన గాయాలతో ఉన్న సర్వన్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించారు. బండరాయితో బాది హతమార్చి, ఓంప్రకాష్‌రాయ్ పరారైనట్లు సునీల్ మాంజి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

శీనునాయక్ హత్య కేసులో 9 మందిపై కేసు

కల్హేర్, ఏప్రిల్ 21: సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలోని సింగర్‌బొగడ తండాకు చెందిన జాదవ్ శీనునాయక్ హత్య కేసులో 9 మందిపై కేసు నమోదు చేసినట్లు కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సిర్గాపూర్ ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సీసీరోడ్డుకు సంబంధించిన కంకర తరలించే క్రమంలో శనివారం సింగర్‌బొగడ తండాలో జరిగిన ఇరువర్గాల ఘర్షణలో శీనునాయక్‌తో పాటు ఆయన సోదరులు రవి, గోపాల్‌లపై కర్రలు, రాళ్లతో మరోవర్గం దాడి చేయగా శీనునాయక్ మృతిచెందాడు. రవి, గోపాల్‌లకు గాయాలయినట్లు పోలీసులు తెలిపారు. శీనునాయక్ తండ్రి పండరి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన జాదవ్ రాజు, బిన్యానాయక్, పండరి, నరేష్, హరి, నారాయణ, సురేష్, సంతోష్, గోవింద్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

రాజకీయ హత్య కాదు: డీఎస్పీ వెంకట్‌రెడ్డి

శీనునాయక్‌ది రాజకీయ హత్య కాదని, తండాకు చెందిన ఇరు కుటుంబాల వారు సీసీరోడ్డు కంకర తరలింపు విషయమై మాటా, మాటా పెరిగి దాడులు చేసుకోవడంతోనే శీనునాయక్ మరణించినట్లు నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. శీనునాయక్ బీఆర్ఎస్ కార్యకర్త కావడంతో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి రాజకీయ హత్య అని ఆరోపించారని, కానీ ఇది రాజకీయ హత్య కాదని డీఎస్పీ వెల్లడించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదులో ఎక్కడా రాజకీయ కక్షతో హత్య చేశారని పేర్కొనలేదని డీఎస్పీ వివరణ ఇచ్చారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



వంగ మాధవి(ఫైల్)

చేగుంట, ఏప్రిల్ 21: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. చేగుంట ఎస్‌ఐ బాలరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట గ్రామానికి చెందిన వంగ స్వాతి అలియాస్ మాధవి(35)-వంగ సత్యనారాయణ దంపతులు స్టేషన్ రోడ్డులోని అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. వారికి కొడుకు(16), కూతురు(13) ఉన్నారు. గత కొన్ని రోజులుగా భార్యా భర్తల మధ్య కుటుంబ కలహాలు నెలకొన్నాయి. దీంతో మనస్తాపానికి గురైన మాధవి జీవితంపై విరక్తి చెంది ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించి, మృతురాలి తమ్ముడు రమేష్ ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. ఓ ఉపాధ్యాయుడు అదృశ్యమైన కేసులో తన భర్తను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో మనస్తాపం చెంది మాధవి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారం జరుగుతున్నది.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

హవేళిఘణపూర్: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా హవేళిఘణపూర్ మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. వాడి గ్రామానికి చెందిన ఇమ్మడి ఏసు(30) వ్యవసాయం చేస్తూ జీవించేవాడు. ఇటీవలే అప్పు చేసి ఇంటిని నిర్మించాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రెండు కార్లు ఢీకొని ఇద్దరికి గాయాలు



పెద్దశంకరంపేట మండలం చీలపల్లి మలుపు వద్ద ఢీకొన్న కార్లు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 21: రెండు కార్లు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం చీలపల్లి సర్వీసు రోడ్డుమలుపు వద్ద ఆదివారం జరిగింది. నిజాంపేటకు చెందిన వీరేశం తన కారులో అల్లాదుర్గం వైపు నుంచి నిజాంపేటకు వెళ్తున్నాడు. పెద్దశంకరంపేట ప్రియాంక కాలనీకి చెందిన భూమయ్య తన కారులో సంగారెడ్డికి బయలుదేరగా చీలపల్లి మలుపు వద్ద అదుపు తప్పి రెండు కార్లు ఢీ కొన్నాయి. ఆయా కార్లలోని అశ్విని, మణెమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. కార్లలోని బెలూన్లు తెరుచుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

కందిలో వివాహిత అదృశ్యం



అనురాధ (ఫైల్)

కంది, ఏప్రిల్ 21: సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కందిలో ఓ మహిళ అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంగారెడ్డి రూరల్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కంది గ్రామంలో నివసించే చిట్కుల సాయిలు బాలజీ ఆస్పత్రిలో వార్డుబాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 14న అతను డ్యూటీ ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇంటికి తాళం వేసి, అతడి భార్య చిట్కుల అనురాధ(40) కనిపించకుండా పోయింది. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం సాయంత్రం సంగారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపై ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులపై కేసు



తోర్నాల గ్రామ శివారులో రహదారిపై వరి ధాన్యం కుప్పలను పరిశీలిస్తున్న పోలీసులు, ప్రజాప్రతినిధులు

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 21: వరి ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టడంతో పాటు రాత్రి సమయాల్లో అక్కడే కుప్పలుగా పోసి ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్ల వాహనదారులకు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను తెలిపారు. శనివారం రాత్రి వరి ధాన్యం కుప్పలను ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటనలో ఇద్దరు రైతులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామానికి చెందిన దుబాసి భాను(24) శనివారం రాత్రి అదే మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల గ్రామానికి చెందిన వాసూర్ యాదయ్య, వాసవి తిరుపతి అనే ఇద్దరు రైతులు గ్రామ శివారులోని మెదక్ రహదారిపై ధాన్యం ఆరబెట్టి కుప్పలుగా చేశారు. ఆ కుప్పలను ఢీకొన్న భాను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిద్దిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

- సంగారెడ్డి జిల్లాలో 2,825 మంది విద్యార్థులు హాజరు



మెదక్ పట్టణంలోని ఓ కేంద్రంలో ప్రవేశ పరీక్షను రాస్తున్న విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 21: తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని 14 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష జరిగింది. 3,275 మందికి 2,825 మంది విద్యార్థులు హాజరు కాగా, 250 మంది గైర్హాజరయ్యారు. 86.25 శాతం హాజరు నమోదైంది. సంగారెడ్డిలోని సాహితి హైస్కూల్, రిషి హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని టీఎస్ఆర్‌జేసీ సెట్ కన్వీనర్ చైతన్య తనిఖీ చేశారు.

మెదక్ జిల్లాలో 2,179 మంది విద్యార్థుల హాజరు

మెదక్ అర్బన్: తెలంగాణ రాష్ట్ర గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 10పరీక్షా కేంద్రాల్లో 2,441 మంది విద్యార్థులకు గానూ 2,179 హాజరైనట్లు జిల్లా సమన్వయకర్త పర్వత వర్ధిని తెలిపారు.

సిద్దిపేట జిల్లాలో 88 శాతం హాజరు నమోదు

సిద్దిపేట క్రైం: సిద్దిపేటలో 9 సెంటర్లను ఏర్పాటు చేశారు. 2,066 మంది విద్యార్థులకు గాను 1,821 మంది విద్యార్థులు హాజరయ్యారు. 88 శాతం హాజరు నమోదయింది.



సంగారెడ్డిలోని సాహితీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సెట్ కన్వీనర్ చైతన్య

కాడెద్దులకు భలే గిరాకీ

- జత కొనాలంటే రూ.లక్షకు పైగా పెట్టాల్సిందే
- జతకు రూ.25నుంచి రూ.35వేల కిరాయి
- ఉగాదికి తెచ్చుకుని దీపావళి తర్వాత యజమానికి అప్పగిస్తున్న రైతులు



మునిపల్లిలో రైతు కిరాయికి తెచ్చుకున్న ఎద్దులు

మునిపల్లి, ఏప్రిల్ 21: వ్యవసాయానికి సంబంధించి ఏ పని చేయాలన్నా గతంలో కాడెద్దుల అవసరం ఉండేది. ప్రస్తుతం యంత్రాలు వచ్చినా కొన్ని పనులకు మాత్రం కాడెద్దుల అవసరం తప్పనిసరి. పత్తి పంట ఏపుగా పెరిగినప్పుడు యంత్రాల సహాయంతో దున్నితే పంట దెబ్బతినే అవకాశం ఉన్నందున ఎద్దులతోనే దున్నకాలు చేపడుతారు. అయితే కాడెద్దులకు ధరలు విపరీతంగా పెరగడంతో రైతులు వాటిని కొనలేక కిరాయికి తెచ్చుకుంటూ పనులు చేసుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండల రైతులు కిరాయి ఎద్దులను నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నాగలిగిద్ద మండలం ఎర్రబొగుడ నుంచి తెచ్చుకుని వ్యవసాయ పనులు కొనసాగిస్తున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 37,500వేల ఎకరాల్లో పత్తి సాగయింది. పొలంలో కలుపు నివారణకు రైతులకు భారంగా మారుతుండడంతో కూలీల ఖర్చునైనా తగ్గించుకుంచేందుకు రైతులు కిరాయి ఎద్దులను తెచ్చుకుంటున్నారు. ఒక్కో జతకు రూ.25వేల నుంచి రూ.35 వరకు చెల్లిస్తున్నారు. ఈ ఎద్దులను ఉగాది పండుగ సందర్భంగా తీసుకువచ్చి దీపావళి పండుగ తర్వాత కిరాయి ఎద్దుల యజమానికి ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో వ్యవసాయం చేయాలంటే ప్రతీ రైతు వద్ద కాడెద్దులు ఉండేవి. ప్రస్తుతం వాటి ధరలు విపరీతంగా పెరగడంతో పాటు వాటికి వేసేందుకు గడ్డి సైతం దొరకడం లేదు. రెండు ఎద్దులు కొనాలంటే సుమారు రూ.లక్షకు తగ్గడం లేదు. దీంతో చేసేదేమి లేక కిరాయి ఎద్దులపైనే ఆధారపడుతుండడంతో వాటికి గిరాకి పెరిగింది.

ఐదేళ్లుగా కిరాయికి తెస్తున్నాను



మాది వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబం ఎద్దులను కొనాలంటే ధరలు మండుతున్నాయి. ఎద్దులను కొనలేక గత ఐదేళ్లుగా నాగలిగిద్ద మండలం ఎర్రబొగుడ గ్రామం నుంచి కిరాయికి ఎద్దులను తెచ్చి వ్యవసాయం సాగిస్తున్నాను. ఉగాది పండుగకు తెచ్చి మళ్లీ దీపావళి తరువాత యజమానికి అప్పగించి వస్తాము. గత ఐదేళ్ల క్రితం జత ఎద్దులకు రూ.18వేల కిరాయి ఉండేది. ఇప్పుడు జత ఎద్దులకు రూ.30వేల కిరాయి ఇస్తున్నాము. ఎద్దులను అక్కడ నుంచి తెచ్చేందుకు రాను, పోను చార్జీలు రూ.6వేలు సైతం తామే చెల్లించాల్సి వస్తోంది. దీంతో జత ఎడ్లకు రూ.36వేల కిరాయి అవుతుంది.

- దిడ్డి విఠల్, మల్లికార్జున్‌పల్లి

బాచేపల్లిలో కుస్తీ పోటీలు

కల్హేర్, ఏప్రిల్ 21: సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి, శ్రీరామనవమి సందర్భంగా ఏటా నిర్వహించే ఈ పోటీల్లో ఈ ప్రాంతానికి చెందిన మల్లయోధులే కాకుండా కర్నాటక, మహారాష్ట్రలకు చెందిన మల్లయోధులు పాల్గొంటారు. ఈ పోటీల్లో విజేతలైన మల్లయోధులకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ప్రవీణ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, సుదర్శన్, చరణ్‌గౌడ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు. శ్రీరామనవమి జాతర ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ప్రదర్శిస్తున్న నల్లపోచమ్మ నాటకం కూడా ఆకట్టుకుంది. కుస్తీ పోటీలను తిలకించడానికి ప్రజలు తరలివచ్చారు.

నిజాంపేట మండలంలోని బాచేపల్లిలో జరిగిన కుస్తీ పోటీల్లో హరాహరీగా తలపడుతున్న మల్లయోధులు



రెడీ టూ ప్లే..

- మే 1 నుంచి 31 వరకు సమ్మర్ కోచింగ్ క్యాంపులు
- యువజన-క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహణకు ఏర్పాట్లు
- చిన్నారులు, యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడమే లక్ష్యం





సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో వాలీబాల్ శిక్షణలో క్రీడాకారులు(ఫైల్)

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 21: చిన్నారులు, యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఏటా మే నెలలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది మే 1నుంచి 31 వరకు సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నెల రోజుల పాటు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో క్రీడా శిబిరాలు నిర్వహించనున్నారు. వివిధ క్రీడాంశాల్లో క్యాంపు నిర్వహణకు సంబంధించి ఇన్‌చార్జిల ఎంపిక కోసం అర్హులైన సీనియర్ ప్లేయర్స్ నేషనల్ ప్లేయర్స్ పీఈటీ, పీడీల నుంచి ఈ నెల 27వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. సమ్మర్ క్యాంపు నిర్వహణకు ప్రభుత్వం రూ.55 వేలు మంజూరు చేయనుంది. ఈ నిధుల్లో రూ.40 వేలు కోచ్‌ల గౌరవ వేతనం, రూ.10 వేలు క్రీడా మైదానం నిర్వహణ, రూ.5 వేలు ప్రథమ చికిత్స అవసరాల నిమిత్తం ఖర్చు చేయనున్నారు.

నేడు బాల్యం నాలుగు గదులకే పరిమితమై బరువెక్కుతున్నది. ఆటల్లేవ్.. ఆడుకోవడాల్లేవనే చందంగా నేటి పిల్లలు, యువత సెల్‌ఫోన్లలోని గేమ్స్‌లో మునిగి హల్‌చల్ చేస్తున్నారు. క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసిక వికాసం లభిస్తుంది. వ్యక్తిగత, సామూహిక క్రీడలతో ఓర్పు, నేర్పు, నైపుణ్యం, పట్టుదల, పోటీతత్వం పెరుగుతుంది. కండర, నాడీ వ్యవస్థకు మధ్య సమన్వయం పెరుగుతుంది. ఎముకలు గట్టిపడటంతో పాటు అన్ని రకాలుగా ఆరోగ్యానికి అవకాశం ఉంటుంది. క్రీడలు శరీరానికి వ్యాయామాన్ని అందించి ఆరోగ్యాన్ని కలిగించేవి. ఈ నేపథ్యంలో చిన్నారులు, యువత క్రీడలపై ఎక్కువ దృష్టి సారిస్తే అవకాశాలు మెండుగా ఉంటాయి.

గ్రామీణ ప్రాంతాల్లో 10 శిబిరాలు

సమ్మర్ కోచింగ్ క్యాంపులు గ్రామీణ ప్రాంతాల్లో 10 క్రీడా శిబిరాలు ఏర్పాటు చేస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో క్యాంపులకు సంబంధించి శిక్షకుడికి రూ.4 వేల గౌరవ వేతనం అందిస్తారు. అథ్లెటిక్స్, వాలీబాల్, ఫుట్‌బాల్, యోగా, ఖోఖో, బాస్కెట్‌బాల్, కబడ్డీ ఇలా వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తారు. 14 ఏళ్ల లోపు వయసున్న వారు మాత్రమే ఈ శిబిరాల్లో పాల్గొనుటకు అర్హులు.

సద్వినియోగం చేసుకోవాలి



నెల రోజుల పాటు వివిధ క్రీడాంశాల్లో ఇచ్చే శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలి. సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందాలనుకునే వారు నేరుగా వెళ్లి పేరు నమోదు చేసుకొని శిక్షణ పొందవచ్చు. విద్యతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి. తద్వారా మంచి భవిష్యత్తు ఉంటుంది. క్రీడల్లో తమ పిల్లలు పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. ఇంకా పూర్తి వివరాలకు 08455-274344 నంబరును సంప్రదించాలి.

- జి.రాంచందర్‌రావు, డీవైఎస్‌వో, సంగారెడ్డి

గ్రామదేవతలతోనే ప్రజలకు రక్షణ

● ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్, ఏప్రిల్ 21: గ్రామదేవతలతోనే ప్రజలకు రక్షణ ఉంటుందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చౌదరిపల్లిలో జరిగిన బొడ్రాయి, పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు ఎంతో అభివృద్ధిని సాధించాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేలూరి వెంకటరెడ్డి, గ్రామ తాజా మాజీ ఉప సర్పంచ్ ప్రొద్దటూరి శ్రీనివాస్, నాయకులు బెల్దె పెంటయ్య, అర్థం శ్రీనివాస్, అనిల్, బెల్దే విశ్వం, తాళ్ల నర్సింలుతో పాటు తదితరులు ఉన్నారు.



దౌలాపూర్‌లో దుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



ఇందుప్రియల్‌లో వీధుల గుండా సీతారాముల రథాన్ని లాగుతున్న భక్తులు

దౌలాపూర్‌లో విగ్రహ ప్రతిష్ఠ

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 21: మండలంలోని దౌలాపూర్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా, ఆదివారం గ్రామ దేవతలైన ఎల్లమ్మ, పెద్దమ్మ, సౌడాలమ్మ, మహంకాళమ్మ, మహాలింగేశ్వరస్వామి విగ్రహాలను పండితులు శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కోరుట్ల మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవార్లకు గ్రామ ప్రజలు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మల్లేశం, వెంకట్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణ, సాయిలు, పుల్లయ్య, ఉప్పల్‌రెడ్డి, జయమ్మ పాల్గొన్నారు.

రథంపై ఊరేగిన స్వామి వారు

దౌల్తాబాద్, ఏప్రిల్ 21 మండలంలోని ఇందుప్రియల్ గ్రామంలో జరుగుతున్న శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు రథంపై ఊరేగారు. ఈ ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. బాలికల కోలాటాల మధ్య రథోత్సవం గ్రామ వీధుల్లో ముందుకు సాగింది. ఉత్సావాలు ఆదివారం ఘనంగా ముగిసాయి.

సింహవాహనంపై స్వామి వారు

బెజ్జంకి, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీలక్ష్మీ సమేత నృసింహస్వామి సింహవాహనంపై ఆలయ అర్చకులు పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు మంగళ హారతులు ఇచ్చి, కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా మండలంలోని దాచారం గ్రామంలో రథోత్సవాన్ని భక్తులు అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రథాన్ని పూలతో సుందరంగా అలంకరించి శ్రీసీతారామస్వామి ఉత్సవమూర్తులను రథంలో నెలకొల్పి ఆలయం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు దివిటీలు, మంగళ హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

ఉత్సవాలకు సర్వం సిద్ధం

రాయపోల్, ఏప్రిల్ 21: మండల కేంద్రమైన రాయపోల్‌లో పోచమ్మ, ఎల్లమ్మ ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఉత్సవాల్లో భాగంగా సోమవారం పోచమ్మ పండుగ నిర్వహించి, ఇంటింటి నుంచి బోనాలు తీసి, ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. మంగళవారం పుట్టమన్ను తేవడం, చెరువులో గంగ తెప్ప విడువం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. బుధవారం ఎల్లమ్మకు బోనాలు తీయడం, ఎల్లమ్మ, జమదగ్నిల కల్యాణం నిర్వహిస్తారు. ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠా మహోత్సవాలు

గజ్వేల్, ఏప్రిల్ 21: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో ముత్యాలమ్మ, నల్లపోచమ్మ ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు, గజ్వేల్ మండలం అనంతరావుపల్లి గ్రామంలోని బొడ్రాయి, గ్రామ దేవతల ప్రతిష్ఠా మహోత్సవాలు మూడోరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా పలువురు ఆలయంలో పూజలను నిర్వహించగా, వారిని సన్మానించారు. కాగా అనంతరావుపల్లి గ్రామంలో రేపటి నుంచి రెండు రోజుల పాటు బోనాల మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.



బెజ్జంకిలో పురవీధుల్లో సింహ వాహనంపై ఊరేగుతున్న నృసింహుడు

దొంగపై దాడి చేసిన గ్రామస్థులు

గజ్వేల్, ఏప్రిల్ 21: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్న సాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని బంజేరుపల్లిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తికి గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. రెండు, మూడు రోజులుగా అనుమానాస్పదంగా తిరుగుతున్న సదరు వ్యక్తిని గమనించిన గ్రామస్థులు ఆదివారం ఉదయం పట్టుకుని దేహశుద్ధి చేయడంతో, గ్రామంలోని హనుమాన్ ఆలయ గేట్లును గతంలో ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నాడు. అనంతరం గ్రామస్థులు ఆ వ్యక్తిని పోలీసులకు అప్పగించారు.

ప్రజ్ఞాపూర్‌లో...

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని జగదేవ్‌పూర్ రోడ్డులోని వెంకటేశ్వరా ట్రేడర్స్‌లో గుర్తుతెలియని వ్యక్తి కంచె దాటి వచ్చి చెట్టు కింద పడుకున్నాడు. ఈ విషయాన్ని అక్కడ ఉన్న హమాలీలు గుర్తించి సదరు వ్యక్తిని చెట్టుకు కట్టివేశారు. యజమానులకు విషయాన్ని తెలపడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని అనుమానాస్పద వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా సదరు వ్యక్తిపై గతంలో ఏనిమిది దొంగతనం కేసులు ఉన్నట్లుగా పోలీసు వర్గాలు తెలిపాయి.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

● గజ్వేల్ ఇన్స్‌పెక్టర్ బి.సైదా



గజ్వేల్ పట్టణంలో సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న సీఐ సైదా

గజ్వేల్, ఏప్రిల్ 21: సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ ఇన్స్‌పెక్టర్ బి.సైదా సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ మైదానంలో హెచ్‌సీఏ, ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో, గజ్వేల్ నియోజకవర్గ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ సమ్మర్ క్యాంపును గజ్వేల్ ఇన్స్‌పెక్టర్ బి.సైదా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి, క్రీడల్లో తమ ప్రతిభను కనబర్చాలన్నారు. ఆయనవెంట అదనపు సీఐ ముత్యంరాజు, బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిని నర్సింహులు, గజ్వేల్ క్రికెట్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు హరిచంద్రారెడ్డి, మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ గజ్వేల్ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు బాకిస్వామి, గౌస్, లతీఫ్‌ఖాన్, గోపి, రవి, భాస్కర్, ఖాజాపాషా ఉన్నారు.

ఎన్నికల నిబంధనలను పాటించాలి

● కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 21: వాహనదారులు, ప్రజలు ఎన్నికల నిబంధనలను పాటించాలని కుకునూరుపల్లి ఎస్ఐ పీ. శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆయన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు, ప్రజలు ఎన్నికల నియమావళిని పాటించాలని, రూ. 50వేలు మించి నగదును తీసుకువెళ్తే సీజ్ చేస్తామని, అత్యవసర పరిస్థితుల్లో ఎక్కువ నగదును తీసుకెళ్తే అట్టి రసీదులను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు.

ఓటర్లను చైతన్యపర్చేందుకు బెలూన్‌తో వినూత్న ప్రచారం



ఖేడ్‌లోని మినీ స్టేడియంపై ఏర్పాటు చేసిన బెలూన్

నారాయణఖేడ్, ఏప్రిల్ 21: అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరుతూ ఓటర్లను చైతన్యపర్చేందుకు ఎన్నికల అధికారులు ఓటరు చైతన్య కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా బెలూన్‌లతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్డీవో అశోకచక్రవర్తి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు పట్టణంలోని మినీ స్టేడియంపై ఓటు హక్కు వినియోగించుకోవాలనే నినాదాలతో కూడిన బెలూన్‌ను గాలిలో ఎగురవేశారు. ఆ మార్గం గుండా రాకపోకలు సాగించేవారు బెలూన్‌ను ఆసక్తిగా తిలకిస్తున్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించు కోవాలి



డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మహ్మద్ సిద్ధిఖీ

జహీరాబాద్, ఏప్రిల్ 21: విద్యార్థులు సానుకూల దృక్పథంతో నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు కృషిచేయాలని హైదరాబాద్‌లోని మౌలానా నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మహ్మద్ సిద్ధిఖీ, మౌలానా నేషనల్ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డా.నజుబుల్లా, కళాశాల ప్రిన్సిపాల్ అస్లాం ఫారూఖీ తదితరులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో నైపుణ్యాల పెంపుదలపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు, యువత అనేక సమస్యలను, సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. వాటిని పరిష్కరించడానికిగాను విద్యార్థులు సమకాలిన నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు సానుకుకూల ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు, యువత మొబైల్ ఫోన్ల వినియోగం ఎక్కువగా కావడంతో లక్ష్యంపై దృష్టిని సారించడంలేదన్నారు. అలాగే విద్యార్థులు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు అయేషాబేగం, శకుంతల, రాములు, సిద్దప్ప, ప్రవీణ్, నాగరాజు, జగన్మోహన్, పాల్గొన్నారు.

సహజ యోగా, ధ్యానం ఎంతో మేలు



సంగారెడ్డిలోని సహజ యోగాధ్యాన కేంద్రంలో యోగాసనాలు నేర్పిస్తున్న సుప్రజ

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 21: సహజ యోగా ధ్యానంతో ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని సహజ యోగా ధ్యాన కేంద్రం రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుప్రజ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని మాతాజీ శ్రీ నిర్మలాదేవి సహజ యోగా ధ్యాన కేంద్రంలో సుప్రజ ఆధ్వర్యంలో ఆదివారం యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురికి యోగాసనాలపై మెళకువలను ఆమె నేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహజ యోగా ధ్యానం వల్ల మనోల్లాసతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. యోగా నిత్య సాధన ద్వారా సమతుల్య జీవనం, సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. అనేక వ్యాధులకు కారణమవుతున్న మానసిక ఒత్తిడి నుంచి విముక్తి కలుగుతుందన్నారు. జ్ఞాపక శక్తి, ఏకాగ్రత, మనోధైర్యంతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో స్టేట్ కో-ఆర్డినేటర్ కృష్ణ ప్రసాద్, జిల్లా కో-ఆర్డినేటర్ వీరేంద్ర ప్రసాద్, సెంట్రల్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, ప్రతినిధులు మనోహర్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా పర్యటన

చేర్యాల, ఏప్రిల్ 21: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం చేర్యాల పట్టణంలో పర్యటించి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంతో పాటు పలు వివాహాలలో పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు కృషి

నారాయణఖేడ్, ఏప్రిల్ 21: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి గుర్రపు మశ్చందర్ పేర్కొన్నారు. ఆదివారం ఖేడ్ శివార్లలోని అంత్వార్ రోడ్డులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను నిల్వ ఉంచుకోవడానికి కోల్డ్ స్టోరేజీ సౌకర్యం లేక పోవడం, దళారి వ్యవస్థ, కల్తీ విత్తనాలు, పురుగు మందులు, సాగునీటి వసతులు సక్రమంగా లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తనను గెలిపిస్తే రైతుల ప్రయోజనాల కోసం వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కల్హేర్ ఎంపీపీ గుర్రపు సుశీల, నాయకులు బస్వరాజ్‌పాటిల్, నాగిరెడ్డి, జలేందర్ ఉన్నారు.

గురుకులానికి 23 మంది విద్యార్థుల ఎంపిక

పాపన్నపేట, ఏప్రిల్ 21: పాపన్నపేటలోని శ్రీవిద్య పాఠశాల నుంచి 23 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రవీందర్, కరస్పాండెంట్ సుమన్, నిటలాక్షప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష నిర్వహించగా శుక్రవారం సాయంత్రం ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ప్రవేశ పరీక్షల్లో శ్రీవిద్య పాఠశాల నుంచి 26 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 23 మంది మొదటి లిస్టులోనే ఎంపిక కావడంతో పాఠశాల యజమాన్యం ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎంపిక సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

కాంగ్రెస్ విజయం తథ్యం

● జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



చేర్యాలలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతా ప్‌రెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 21: పాంచ్ న్యాయ్ గ్యారంటీలతో పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధించి, కేంద్రంలో అధికారంలోకి వస్తుందని జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా ఆదివారం చేర్యాల, కొమురవెల్లి మండలాల నుంచి పార్టీ కార్యకర్తలతో భువనగిరికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలో వాహనాల ర్యాలీని ప్రారంభించిన సందర్భంగా కొమ్మూరి మాట్లాడారు. రాష్ట్రంలో మెజారిటీ పార్లమెంట్ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జడ్పీ ఫ్లోర్‌లీడర్ గిరి కొండల్‌రెడ్డి, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కొమురవెల్లి మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, మంచాల చిరంజీవులు, దాసరి కళావతి, ముస్త్యాల యాదగిరి, సనాది భాస్కర్, దాసరి శ్రీకాంత్, వంగ జయ, ఎండీ జహీరుద్దీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కాంగ్రెస్ జడ్పీ ఫ్లోర్‌లీడర్ గిరి కొండల్‌రెడ్డి, కొమురవెల్లి మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ సమక్షంలో కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు పుట్ట మల్లేశం, నాయకులు ఈగ కనకయ్య, ఎల కనకయ్య, కంకణా చంద్రం, రుద్రారం సిద్దులు, ఎల కనకయ్య తదితరులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు.

ధాన్యం కొనుగోళ్లను త్వరగా చేపట్టాలి

దౌల్తాబాద్, ఏప్రిల్ 21: కొనుగోలు కేంద్రాల్లోన్ని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ రహీమోద్దీన్ కోరారు. ఆదివారం సయ్యద్ రహీమోద్దీన్ విలేకర్లతో మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ ధాన్యం సేకరించి త్వరగా మిల్లులకు తరలించేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు.

పుస్తే, మెట్టెలను అందజేసిన కౌన్సిలర్



పెళ్లి కూతురు కుటుంబ సభ్యులకు పుస్తే, మెట్టెలు అందజేస్తున్న కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 21 : పేదింటి ఆడపడుచుకు సిద్దిపేట 38వ వార్డు కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం చేయూతనిచ్చారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామానికి చెందిన ఆర్మూర్ బాలమణి - పరశురాముల కుమార్తె రుచిత వివాహానికి, బ్రహ్మం తన తల్లి ధర్మవరం శకుంతల జ్ఞాపకార్థంగా పుస్తే మెట్టెలను తన కూతురు సౌజన్య అల్లుడు అవినాష్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బ్రహ్మం మాట్లాడుతూ పేదలకు తనవంతు సాయాన్ని అందించినప్పుడే మనసుకు నిజమైన సంతృప్తిని కలిగిస్తుందని అన్నారు. కార్యక్రమంలో బాబు, శ్రీను, పెళ్లికూతురు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

● నంబరు ప్లేటు లేని వాహనాల్లో తరలింపు

● గ్రామ శివారుల్లో డంపు చేస్తున్న వైనం

● చోద్యం చూస్తున్న అధికారులు



చిన్నకోడూరు మండలం మైలారం శివారులో నంబరు ప్లేటు లేని ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

చిన్నకోడూరు, ఏప్రిల్ 21: మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామలలో జోరుగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నది. సంబంధిత ప్రభుత్వ విభాగాలు నిఘా పెట్టకపోవడంతోనే ఇసుక వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా ఇసుక దందాను సాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సరిహద్దు జిల్లా అయిన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల్లోని గ్రామాల వాగుల నుంచి ఇసుకను తరలిస్తూ దందాను కొనసాగిస్తున్నారు.

మైనర్లే డ్రైవర్లు

నంబరు ప్లేటు లేని వాహనాలలో ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక వ్యాపారం లాభసాటిగా మారడంతో రాత్రి, పగలు తేడా లేకుండా జిల్లా సరిహద్దును దాటుకోని రోజుకు పదుల సంఖ్యలో ఇసుక వాహనాలు వస్తున్నాయి. ఇసుక తరలిస్తున్న వాహనాలను ఎక్కువగా మైనర్లే నడుపుతున్నారు. వాహనాలను అతివేగంగా నడపడం వల్ల ఇతర వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు తనిఖీలు చేసి ఇసుక వాహనాలను స్వాధీనం చేసుకుని నామమాత్రపు జరిమానాలు విధిస్తూ వదిలేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గ్రామ శివారుల్లో ఇసుక డంపులు

మండలంలోని పలు గ్రామాల శివారు ప్రాంతాల్లో వ్యాపారులు ఇసుకను నిల్వ చేసి, వాహనాలలో తరలిస్తున్నట్లు సమాచారం. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసుల కనుసన్నల్లోనే ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్న ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మెడికల్ షాప్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బింగి శ్రీనివాస్



మెడికల్ షాప్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

హుస్నాబాద్, ఏప్రిల్ 21: హుస్నాబాద్ ఏరియా మెడికల్ షాపు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బింగి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా ముంజ రమేశ్, కోశాధికారిగా రావుల రంజిత్‌లను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వి వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కనుకుంట్ల శ్రీనివాస్, గౌరవసలహాదారుడిగా కొంకటి రవిని ఎన్నుకున్నారు.

గీత కార్మికుడికి గాయాలు

చేర్యాల, ఏప్రిల్ 21: చేర్యాల మండలం చిట్యాల గ్రామానికి చెందిన గీత కార్మికుడు గొట్టిపర్తి నర్సయ్య ఆదివారం తాటిచెట్టుపై నుంచి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన చుట్టుపక్కలవారు కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. నడుముకు బలమైన గాయం కావడంతో ఉన్నతాస్పత్రికి తీసుకువెళ్లమని వైద్యులు సూచించడంతో హైదరాబాదుకు తరలించారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి ఫోన్ అందిస్తున్న ఏఎస్ఐ

మద్దూరు, ఏప్రిల్ 21: మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన అందె మహేందర్ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధతుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ గుర్తించి అప్పగించినట్లు ఆదివారం ఏఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఏఎస్ఐ మాట్లాడుతూ.. అందె మహేందర్ మూడు నెలల క్రితం సిద్దిపేట వెళుతుండగా, తన జేబులోంచి ఫోన్ పడిపోయిందని ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు గుర్తించి అందించామన్నారు.

బీజేపీలో చేరిన యువకులు



యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాంరెడ్డి

మర్కుక్, ఏప్రిల్ 21: మర్కుక్ మండల కేంద్రంలో పలువురు వివిధ పార్టీలకు చెందిన యువకులు బీజేపీ మర్కుక్ అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరె డ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించడానికి వీరంతా బీజేపీలో చేరారన్నారు. పార్టీలోకి వచ్చిన వారిలో సందీప్‌రెడ్డి, వెంకటేశ్, స్వామి, కరుణాకర్, బాల్‌రెడ్డి, మహేశ్, వంశి ఉన్నారు.

పశువైద్య సేవల అంబులెన్స్ తనిఖీ



తనిఖీ కోసం వచ్చిన పర్యవేక్షకుడు హుస్సేన్

నారాయణఖేడ్, ఏప్రిల్ 21: ఖేడ్ పశువైద్య కేంద్రంగా పశువైద్య సేవలు అందిస్తున్న 1962 అంబులెన్స్ వాహనాన్ని ఆదివారం ఈఎంఆర్ఐ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన పర్యవేక్షకుడు హుస్సేన్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో అందుబాటులో ఉన్న పశువైద్య పరికరాలు, మందులను పరిశీలించారు. వేసవికాలంలో పశువులకు సోకే వివిధ వ్యాధులు, వాటి నివారణకు అవసరమైన మందులను పరిశీలించారు. వ్యాధులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అంబులెన్స్ పైలెట్ ప్రవీణ్, సహాయకుడు నరేష్‌కు అవగాహన కల్పించారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

కుకునూరుపల్లి, ఏప్రిల్ 21: రాయవరం కాంగ్రెస్ గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రంగ శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా డబ్బేట యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా బోయిని ప్రవీణ్, కార్యదర్శిగా కుక్కల రాజశేఖర్, యూత్ ప్రెసిడెంట్‌గా రాసం కరుణాకర్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా విజయ్, ఎండీ రబ్బాని, గణేష్, రంగా వేణులను ఎన్నుకున్నారు.

ఎమ్మార్సీ భవన నిర్మాణంపై నిర్లక్ష్యం

● పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్ అలసత్వం

● పట్టించుకోని ప్రజాప్రతినిధులు,అధికారులు




బేస్‌మెంట్ స్థాయిలోనే నిలిచిన నిర్మాణ పనులు

నారాయణరావుపేట, ఏప్రిల్ 21: మండల కేంద్రం ఏర్పడిన తర్వాత సర్వశిక్షా అభియాన్ నిధులతో మంజూరైన మండల మానవ వనరుల కేంద్రం (ఎమ్మార్సీ) భవనం నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. విద్యా శాఖలో రిపోర్టుల తయారీ, రిజిష్టర్ల నిర్వహణ, టెక్నాలజీ వినియోగం వంటి అన్ని రకాల పనులను మండల విద్యావనరుల కేంద్రం నుంచే నిర్వర్తిస్తుంటారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో ఎమ్మార్సీ నూతన భవన నిర్మాణం కోసం సర్వశిక్షా అభియాన్ కింద రూ. 40లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు భవన నిర్మాణంపై నిర్లక్ష్యం ధోరణి కొట్టోచ్చినట్లు కనిపిస్తున్నది. ప్రజాప్రతినిధులు, నాయకుల మధ్య ఏకాభిప్రాయం కుదకపోవడంతో నిర్మాణం పనులు ఆగిపోయాయి. అసెంబ్లీ ఎన్నికల అనంతరం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ బేస్‌మెంట్ స్థాయిలోనే పనులను నిలిపివేశాడు. నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన అధికారుల పర్యవేక్షణ లోపంతో, కాంట్రాక్టర్ అలసత్వం వహిస్తున్నాడన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.

నిధులున్నా నిర్లక్ష్యం

మండల మానవ వనరుల కేంద్రం (ఎమ్మార్సీ) భవనం నిర్మాణం కోసం సర్వశిక్షా అభియాన్‌లో నిధులు ఉన్నా, నిర్మాణంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. విద్యా సంవత్సరం ముగుస్తున్నప్పటికీ నిర్మాణం పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. విద్యా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు సహకరించాల్సిన ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. పాఠశాలల పునఃప్రారంభం అయ్యేలోపైన ఎమ్మార్సీ భవనం అందుబాటులోకి వస్తుందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఆర్వీఎం ఏఈ పేషిని వివరణ కోరగా ఎమ్మార్సీ భవన నిర్మాణం పనులు ఆలస్యం అయింది వాస్తవమేనని, సంబంధిత కాంట్రాక్టర్ కాలికి గాయం కావడంవల్ల రాలేకపోయాడని, త్వరలోనే పనులు పూర్తిచేసి వచ్చే విద్యా సంవత్సరంలో నూతన ఎమ్మార్సీ భవనం నుంచే విధులు నిర్వహించేందుకు భవనాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

నిర్మాణం పనులను వేగవంతం చేయాలి



నిర్మాణ పనుల వేగవతం చేయాలి. ప్రభుత్వం నుంచి భవన నిర్మాణానికి బిల్లులు చెల్లించేందుకు బడ్జెట్ ఉన్నప్పటికీ, కాంట్రాక్టర్ నిర్మాణం పనుల్లో నిర్లక్ష్యం చేయడం సరికాదు. అధికారులు ఎప్పటికప్పుడు నిర్మాణం పనులను పర్యవేక్షించాలి. వెంటనే ఎమ్మార్సీ భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతున్నాం. పనులల్లో నిర్లక్ష్యం చూపితే త్వరలోనే జిల్లా మంత్రుల దృష్టికి తీసుకెళ్తాం.

- గౌటి బాబేష్, కాంగ్రెస్ ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి